క్లుప్తంగా

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

కేశంపేట: ఇంటర్ పరీక్షలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం కామర్స్, కెమిస్ట్రీ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు 160 మంది విద్యార్థులకు గాను 151 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ ఎగ్జామినార్ మల్లేశ్ తెలిపారు.

ముదిరాజ్‌లకు న్యాయం చేయండి

ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర కన్వీనర్ నారాయణ

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ 'ఏ' గ్రూప్‌లో చేర్చి న్యాయం చేయాలని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర కన్వీనర్ బానిన నారాయణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ముదిరాజ్‌లు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లో చేర్చిన తర్వాత ఉద్యోగ నోటిఫికేషన్లను ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రిజర్వేషన్ శాతను పెంచాలని డిమాండ్ చేశారు. గతంలో ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి ఉన్న సమయంలో ముదిరాజ్‌లను బీసీ' ఏ'లో చేర్చారని, అనంతరం మళ్లీ తొలగించారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌ల నాయకత్వంను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంక్షేమ సమితి నాయకులు అల్లాదుర్గం సురేశ్, జూలపల్లి అనసూయమ్మ, టేకుల శ్రీనివాస్, తుమ్మల గోపాల్, సూరమోని యాదయ్య, లాలమోని చంద్రయ్య, రామకృష్ణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకులకు నల్లాల బిగింపు

సాక్షి ఎఫెక్ట్..



ఆన్, ఆఫ్ నల్లాలు బిగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: మున్సిపాలిటీలోని అజీజ్ నగర్ ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకుకు సిబ్బంది గురువారం ఆన్, ఆఫ్ నల్లాలు బిగించారు. అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకుకు ఆన్, ఆఫ్ నల్లాలు లేక నీరు వృథాగా పోతోందనే సమస్యపై మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన తాగునీరు వృథా అనే కథనానికి అధికారులు స్పందించారు. ట్యాంకుకు ఆన్, ఆఫ్ నల్లాలతో పాటు గేట్ వాల్స్‌ను బిగించారు. దీంతో చుట్టు పక్కల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా ట్యాంకు వద్ద ఉన్న చెత్తను తొలగించడంపై స్థానికులు సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు

మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న కమిషనర్ పూర్ణచందర్

చేవెళ్ల: ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద వార్డు కార్యాలయం వద్ద గురువారం ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు చంద్రయ్య ఆధ్వర్యంలో నగరంలోని యశోద ఆస్పత్రి వైద్య బృందం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యపరీక్షలు చేయించుకున్నారు. మొత్తం 185 మంది ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించామని, అవసరమైన వారికి మందులు అందజేశామని వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు రాఘవేందర్, వైద్యుల బృందం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం

షాద్‌నగర్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించి తలపెట్టిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు మంజూరు చేయడంతో పాటు నిధులు కేటాయించడం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం నాయకులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించినందుకు గాను నాయకులు ఎమ్మెల్యేకు సీట్లు తినిపించారు. ఈ సందర్భంగా పట్టణ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

'పది'కి సర్వం సిద్ధం

ఏడాది పాటు చదివిన చదువుకు పరీక్ష రూపంలో ప్రతిభను వెలికి తీసే సమయం ఆసన్నమైంది. గంపెడాశలు పెట్టుకున్న తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే సమయం వచ్చింది. పరీక్షల్లో రాణించి విజయం సాధించే తరుణం ప్రారంభమైంది. పదో తరగతి పరీక్షలు ఈ నెల 21 నుంచి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు గాను అకారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేటి నుంచి పరీక్షలు ప్రారంభం

- విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు
- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

షాద్‌నగర్: పదో తరగతి పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో మొత్తం 4275 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షకు హాజరు కానున్నారు. ఇందుకు గాను నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మొత్తం 21 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాలకు సమయానికి ప్రశ్నాపత్రాలను పంపించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులు పరీక్ష సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలని ఎంఈఓ మనోహర్ తెలిపారు.

748 మంది విద్యార్థులు..

షాబాద్: ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదోతరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నాలుగు పరీక్ష కేంద్రాలను డిప్యూటీ తహసీల్దార్ మధుతో కలిసి వారు పరిశీలించారు. మండల పరిధిలో 12 ఉన్నత పాఠశాలలకు చెందిన 748 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, ఇందుకు గాను నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు.



షాద్‌నగర్‌లోని పదో తరగతి పరీక్ష కేంద్రం



షాబాద్: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ మధు

చేవెళ్ల మండలంలో 5 కేంద్రాలు

చేవెళ్ల: పదో తరగతి వార్షిక పరీక్షలకు మండలంలో అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. మండలంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 764 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు మండల విద్యాధికారి పురన్‌దాస్ తెలిపారు. గురవారం మండలంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాలను ఎంఈఓ, ఎంపీడీఓ హిమబిందు వేరువేరుగా పరిశీలించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు వచ్చి పరీక్షలు రాసి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని కోరారు.

మొయినాబాద్‌లో ఏడు..

మొయినాబాద్: పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 21 నుంచి పరీక్షలు మొదలుకానున్నాయి. మొయినాబాద్‌లో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1399 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను గురువారం ఎంఈఓ వెంకటయ్య పరిశీలించారు. ఎక్కడా విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.



చేవెళ్లలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ పురన్‌దాస్



మొయినాబాద్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటయ్య

బడ్జెట్‌లో విద్యారంగంపై నిర్లక్ష్యం

బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ



సమావేశంలో మాట్లాడుతున్న శివాజీ

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మల్తాంకార్ శివాజీ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్ 3 లక్షల కోట్ల కుపైగా ప్రవేశపెడితే అందులో విద్యారంగానికి 10శాతం కూడా కేటాయించలేదన్నారు. ఎన్నికల సమయంలో విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. నిరుపేదలకు విద్యను దూరం చేయాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇప్పటికే ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కింద 8వేల కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన అరోపించారు. ప్రభుత్వం స్పందించకుంటే బీజేవైఎం అధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు రావుల రాకేశ్, రాఘవేంద్రాచారి, శివ తదితరులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతను పాటించాలి

డాక్టర్ రాకేశ్‌కుమార్



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నోటి శుభ్రతను పాటించాలని డాక్టర్ రాకేశ్‌కుమార్ సూచించారు. గురువారం పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలలో మైక్రో బయోలజీ అధ్యాపకురాలు కళాజ్యోతి ఆధ్వర్యంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోటి డెంటల్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ రాకేశ్‌కుమార్ హాజరై విద్యార్థినులకు దంత పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నోటి పరిశుభ్రత సరిగా లేకపోవడంతో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు, నోటి కేన్సర్, గుండె జబ్బులు వంటి ప్రాణాంత వ్యాధులకు దారి తీస్తుందన్నారు. దంతాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. నోటి పరిశుభ్రత, దంత రక్షణ పాటిస్తే మన ముఖంలో చిరునవ్వులు వెలుగుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు విధించొద్దని వినతి

చేవెళ్ల: వ్యవసాయ పనులు చేసుకునే సమయంలో విద్యుత్ అంతరాయంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని బీజేపీ నాయకుడు వెంకట్‌రెడ్డి అధికారిని కోరాడు. చేవెళ్లలోని విద్యుత్ కార్యాలయంలో గురువారం ఏఈ రాజేందర్‌ను కలిసి రైతుల సమస్యలపై వినితిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గుండాల, రేగడిఘనాపూర్, ఖానాపూర్, దేవరంపల్లి, అల్లవాడ, తదితర గ్రామాల్లో రైతులు కూరగాయలు, పూల సాగు అధికంగా చేస్తుంటారన్నారు. ఈ సీజన్‌లో రైతులకు సాయంత్రం సమయంలో విద్యుత్ అవసరం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ కోతలను విధించొద్దని కోరారు. ఈ విషయమై ఏఈ సానుకూలంగా స్పందించి ఏడీ దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు.



విద్యుత్ సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న నాయకుడు వెంకట్‌రెడ్డి

మెరుగైన వైద్యసేవలు అందించాలి

డాక్టర్ స్రవంతి

షాద్‌నగర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని డాక్టర్ స్రవంతి సూచించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మిషన్ పథకం కింద ప్రతి ఒక్కరికీ అభయ కార్డును నమోదు చేయాలని సూచించారు. 30 సంవత్సరాలు దాటిన వారందరికీ బీపీ, షుగర్ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని, అవసరమైన వారికి ప్రతి నెల సరిపడా మందులను అందజేయాలన్నారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు, వేడిగాలుల కారణంగా వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ తగిలిన వారిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించాలని తెలిపారు. సమావేశంలో డాక్టర్ ముస్తకిన్, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, శ్రీరామ, స్టాఫ్ నర్సు ఫకీరమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ శివకుమార్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

చేవెళ్ల: అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు, రేషన్‌కార్డులను అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో చేవెళ్లలో గుడిసెలు వేసుకున్న పేదలతో కలిసి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయం వద్దకు వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఏఓ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలోని సర్వే నెంబర్ 75 ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు అందించాలని. వారికి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు సర్వేచేసి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. పేదలతో ఆర్డీఓ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి తదితరులు ఉన్నారు.



ఏఓ రాజశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, ప్రజలు

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, పార్టీ సీనియర్ నాయకుడు బొక్క బాలకృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్లు 42 శాతం పెంచడం, ఎన్నో ఏళ్ల ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం చరిత్రాత్మకమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. పార్టీపై ప్రజాదరణ చేసి ఓర్వలేకే ఆయా పార్టీల నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలిచేందుకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిరుద్యోగుల కోసం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసంకు ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



రాజభూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు

చేవెళ్ల: బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పంతంగి రాజగోపాల్‌గౌడ్‌ను మండల బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో కలిశారు. గురువారం ఆయన నివాసంలో కలిసిన వారు అధ్యక్షుడిగా ఎన్నికై నందుకు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ పుట్టినరోజు సందర్భంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనంత్ రెడ్డి, యువనాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, నాయకులు మానిక్యరెడ్డి, శర్వలింగం, అంజనేయులుగౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, ఇంద్రాసేనారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల



సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విశాల, నాయకులు

కేశంపేట: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు అసెంబ్లీలో ఆమోదం పొందడంపై మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భాస్కర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, కరుణాకర్, పల్లె అనంద్, కరుణాకర్‌రెడ్డి, గిరియాదవ్, అనసూయమ్మ, అమీర్, శ్రీనాథ్, రాజేందర్ రెడ్డి, సూరమోని యాదయ్య, గ్యార సురేశ్, భీమయ్య, అఖిల్, రాఘవేందర్ పాల్గొన్నారు.

ఇంటివద్దకే రామయ్య తలంబ్రాలు

ఆర్టీసీ షాద్‌నగర్ డీఎం ఉష

షాద్‌నగర్‌రూరల్: శ్రీరామనవమిని పురస్కరించుకొని భద్రాచలం శ్రీసీతారామచంద్రుల కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ సంస్థ భక్తుల ఇంటివద్దకే అందిస్తుందని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం ఉష కోరారు. గురువారం పట్టణానికి చెందిన మల్లికార్జున్ స్వామివారి తలంబ్రాలను బుక్ చేసుకున్నాడు. ఈ సందర్భంగా డీఎం ఉష మాట్లాడుతూ.. భద్రాచలంలో శ్రీసీతారాములు కల్యాణానికి వెళ్లలేని భక్తులకు తలంబ్రాలను ఇంటి వద్దనే అందించేందుకు ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాములోరి తలంబ్రాలు ప్రతి ఇంటికి చేరాలనే ఆలోచనతో ఆర్టీసీ సంస్థ భక్తులకు ఈ అవకాశాన్ని కల్పిస్తుందని, తలంబ్రాలు కావాల్సిన భక్తులు రూ.151 చెల్లించి బస్టాండ్ ఆవరణలో గల కార్గో కేంద్రంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కల్యాణం అనంతరం తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దనే అందిస్తామని తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం కల్పించిన ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రామయ్య తలంబ్రాలను బుక్ చేసుకున్న భక్తులు

బాధితుడికి ఆర్థికసాయం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామానికి చెందిన కొమ్ముగారి రామకృష్ణకు చెందిన 11 మేకలు ఈ నెల 17న కుక్కల దాడిలో మృతి చెందాయి. గురువారం ఈ విషయాన్ని స్థానిక సీపీఎం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తక్షణ సహాయంగా బాధితుడికి రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సీపీఎం డివిజన్ కార్యదర్శి రాజు, కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీను నాయక్, ఈశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ పోరాట ఫలితమే వర్గీకరణ బిల్లు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ సుదీర్ఘ పోరాట ఫలితంగా అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం లభించిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా బుధవారం రాత్రి నర్సింహ ఆధ్వర్యంలో పట్టణ ముఖ్య కూడలిలో మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వర్గీకరణ పోరాటంలో మరణించిన మాదిగ అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు దండోరా డప్పుల దరువులు, ఆటాపాటలతో బాణాసంచా కాల్చుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్, పాండు, నాగభూషణం, సురేశ్, మహేందర్, శ్రీనివాస్, శివశంకర్, యాదగిరి, చందు, శ్రీను, హరీశ్, శ్రీశైలం, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫత్తేపూర్‌లో ఇఫ్తార్ విందు

శంకర్‌పల్లి: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శంకర్‌పల్లి తాజా మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ముస్లింలు పాల్గొని విందును స్వీకరించారు. మతం ఏదైనా అందరం కలిసిమెలసి ఉండాలని గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్ రెడ్డి, యాదగిరిరెడ్డి, శంకర్, జంగయ్య, వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌తో సస్యశ్యామలం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంతోనే షాద్‌నగర్ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. షాద్‌నగర్ పరిధిలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను కుర్చీ వేసుకొని నిర్మిస్తామని చెప్పిన కేసీఆర్ ప్రజలను, రైతులను పూర్తిగా మోసం చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణానికి కట్టుబడి ఉండి బడ్జెట్‌లో నిధులు కేటాయించిందన్నారు. భవిష్యత్‌లో రిజర్వాయర్ నుంచే హైదరాబాద్‌కు మంచి నీటిని అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం చరిత్రాత్మకం

ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం చరిత్రాత్మకమని, మాదిగలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వర్గీకరణ అంశం కోసమే ప్రభుత్వం ఉద్యోగాల నియామకాల ప్రక్రియను ఆపిందన్నారు. వర్గీకరణ కోసం గతంలో గ్రామ గ్రామాన ఉద్యమాలు జరిగినా గత పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. సమావేశంలో బాబర్‌ఖాన్, రఘునాయక్, సిద్దార్థ, కొమ్ము కృష్ణ, సురేందర్, జాంగారి రవి, జగన్, అనిల్, లింగారం యాదయ్య, జగన్, స్వామి, విశ్వం, శ్రీకాంత్ రెడ్డి, బాల్‌రాజ్, కొంకళ్ల చెన్నయ్య, జమృత్‌ఖాన్, బస్వం, దంగు శ్రీనివాస్, ఇబ్రహీం, విజయ్‌కుమార్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్